


# యాక్సిడెంట్

ఆర్. విజయలక్ష్మి

"బిడ్డొచ్చిన వేళ... గొడ్డొచ్చిన వేళ అన్నారు. ఒక్కో ఆడది ఇంట్లో అడుగిడితే ఇక అంతే! ఆ ఇల్లు దుంపనాశనమే..."

"గుడుపూరోలి కోడలు గుమ్మంలో అడుగెట్టిందో లేదో గుండెపోటొచ్చి మామ గుటుక్కుమన్నాడు..."

"అత్తమాత్రం... ఆర్నెల్లు తిరక్కుండానే పక్షవాతమొచ్చి పడిపోలేదు...?"

"అంతేమరి. ఒక్కో నష్టజాతకురాలి వలన దానికేకాక ఇంటిల్లిపాదికి సుడి సుట్టేస్తుంది."

వాళ్లు అంటున్న ఒక్కొక్క మాట నా గుండెలో తూట్లు పొడుస్తోంది.

వాళ్లు కావాలనే నాకు వినపడాలనే అంతంత నోరు పెట్టుకు అంటున్నారు. ఉదయం ఆరుగంటల నుండీ ఇదే వరస. విషయం తెలిసి వచ్చిన ప్రతివారు ఏదో ఒకటి నన్నే అంటున్నారు, నావైపే చూస్తున్నారు.

నేనేం చేశాను? అసలు వీళ్లంతా ఎవరైంది కూడా సరిగ్గా నాకు తెలియదే. వాళ్లందరికీ నామీద ఎందుకంత కసి, కోపం?!

నాకేమీ అర్థం కావడం లేదు.

జరిగిన సంఘటనతో నేను కుమిలి కుమిలి

ఏడుస్తుంటే, అది చాలదన్నట్లు ఈ సూటిపోటి మాటలు నన్ను మరింత బాధకు గురిచేస్తు న్నాయి. ఇందులో నేను చేసిన తప్పేమిటి?! అప్పటికీ అతన్ని వద్దని వారించబోయాను. తప్పదంటూ ఆయన బయలుదేరితే నేనేం చేయాలి? అయినా ఇలా అవుతుందని ఎవరు మాత్రం కలగనగలరు.

బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరు గువాళ్లు అంతా సానుభూతి చూపించడానికి వచ్చారు. వచ్చిన వాళ్లు అందరూ మా అత్త గారి చుట్టూ చేరి తమలో తామే మాట్లాడు కుంటున్నారు. మా అత్తగారిని ఓదార్చుతు న్నట్లు నటిస్తూ నన్ను ఆడిపోసుకుంటు న్నారు.

"ఊరుకో వదినా, ఊరుకో! ఏడిస్తే ఏమొ స్తుంది కళ్లకు జబ్బు తప్ప..."

"చెట్టంత కొడుకు ఒక్కసారి పోతే ఎలా ఊరుకుంటుందమ్మా?"

"ఏం చేస్తాం! మన చేతిలో ఏముంది గనుక..."

అసలే కొడుకో...కొడుకో అని గుండె బాదుకుంటున్న ఆవిడ దగ్గరకెళ్లి ధైర్యం చెప్పాల్సిందిపోయి మరింత అపనమ్మ కాన్ని కలిగిస్తున్నారు. ఆమె కడుపు చెరువై పోతోంది.


ఒకరిని అని లాభం లేదు. ఇదంతా నా దురదృష్టం. కాకపోతే మరేమిటి?! పెళ్లయి అత్తవారింటికొచ్చిన పదిహేను రోజులకే ఇంతటి దుర్ఘటన జరగడమేమిటి! జీవితాంతం ఏడవమనే భగవంతుడు నన్ను పుట్టించినట్టు న్నాడు. నాకు ఎక్కడా సుఖంలేదు, శాంతి లేదు.

నాకు అమ్మా నాన్న గుర్తుకొచ్చారు వాళ్లకీ విషయం తెలిస్తేనో... ఎలా తెలు స్తుంది? ఒకవేళ తెలిసినా "అంతే. దాని దారి ద్రం దాన్ని వదల్లేదు. అది ఎక్కడికెళ్లినా అరి ష్టమే" అంటారు. నాకు తెలుసు వాళ్లు కచ్చి తంగా అలాగే అంటారు. నా పట్ల జాలి, దయ, కరుణలాంటివి ఏమాత్రం వాళ్లు చూపరు.

నా చిన్నమంతా కసుర్లు, విసుర్లు మధ్యే కరిగిపోయింది. నాన్నకు నేనంటే ఎప్పుడూ చిరాకే. అయిన దానికి కానిదానికి నన్ను కసురుతూనే ఉండేవారు.

"అదేం చేసిందండీ చిన్నపిల్ల" అని అమ్మ మొదట్లో అప్పుడప్పుడు అనేది. కాని నాన్న అమ్మమీద చిరాకు చూపించేవాడు. అమ్మ నోటిని బలవంతంగా మూయించే వాడు. రానురాను అమ్మకు కూడా నేనంటే అయిష్టమేర్పడింది.

నేను పుట్టిన నాటినుంచి కష్టాలు, నష్టాలు మొదలయ్యాట మా కుటుంబంలో. అంతవ రకు ఎంతో బాగా నడిచిన నాన్న వ్యాపారం



అబ్బాయి ఎం. ఏ. చదివాడంటు న్నారు ఏం చేస్తున్నాడేమిటి?
నాకు తోడుగా ఉంటున్నాడు.
మీరేం చేస్తున్నారు?
ఇంట్లో ఖాళీగా ఉంటున్నాను.

రామకృష్ణారెడ్డి
భూపతిపాలెం

తర్వాత తర్వాత బాగా దెబ్బతినిపోయిం దట. ఇంట్లో జ్వరాలు. జబ్బులు... అప్పులు, బాధలు అన్నీ పెరిగిపోయాయి. "ఎందులో చేయి పెట్టినా ఏదీ కలిసిరావడం లేదు" అని నాన్న చాలా బాధపడేవాడట.

అన్నింటికీ కారణం నేను పుట్టడమేనట. నేను పుట్టిన వేళావిశేషం అలాంటిదని, దోషాలున్నాయని పంతులుగారు చెప్పారట. ఎన్నో శాంతికర్మలు చేయించారట. అయినా లాభం లేకపోయిందట. అందుకే నన్ను చూస్తే నాన్నకు మొదటినుండి విపరీతమైన కోపం, అసహనమున్నూ.

ఆఖరికి నేను పుష్పవతి అయినప్పుడు కూడా ఏదో నక్షత్రదోషం ఉందట. దానివల్లే ఆ సంవత్సరం మా భూములకు సంబంధిం చిన కోర్టు కేసులో ఓడిపోయామట! ఆ దెబ్బతో మా కుటుంబం చాలా ఊబిలో కూరు కుపోయిందట. ఒక రకంగా బికార్లమే అయి పోయామట! అందువల్లే నా మీద నాన్నకు గాని, అమ్మకుగాని అంత కోపమట. మా మేనత్త ఒకసారి నాకీ విషయాలన్నీ చెప్పింది. బాధపడింది. ఆమె చెప్పినప్పటి నుంచి నేను పరిస్థితులను అర్థం చేసుకునే దాన్ని. ఇంట్లో పరిస్థితులు నాకు తెలుసూనే ఉండేవి. కాని అలా ఎందుకయ్యాయో, దేని కేది కారణమో నాకుమాత్రం అర్థమయ్యేది కాదు.

నా వల్లే అన్ని అనర్థాలు జరుగుతున్నా యని అంటున్నప్పుడు, నాకెంతో దుఃఖం వచ్చేది. మూగగా రోధించడాన్ని ఎవరూ లేనప్పుడు గోడలకేసి తల బాదుకునేదాన్ని. అంతకుమించి నేనేం చేయగలను!?

"దేవుడా నన్ను చంపేయకూడదా" అని దేవుణ్ణి ప్రార్థించేదాన్ని, కానీ ఏ దేవుడు నా ఏడుపు వినలేదు. నేను మా వాళ్లకు భారం కాక తప్పలేదు. చాలారోజుల తరవాత నాకో తమ్ముడు పుట్టాడు. వాడు పుట్టినతర్వాత మా పరిస్థితిలో కొంచెం మార్పు వచ్చిందట. అందుకే నాన్నగారికి తమ్ముడంటే విపరీతమ యిన అభిమానం, వంశాన్ని నిలబెట్టడానికి కొడుకు పుట్టాడని, అందులోనూ వాడు అదృష్టజాతకుడని నాన్న గర్వపడేవాడు. వాడు పెరిగి పెద్దవాడై సంపాదించే వయసొ చ్చేసరికి మా పూర్వ వైభవం వస్తుందని తన స్నేహితులతో నాన్న కూడ చెప్పేవాడు. "ఆ మాట నిజమే" అని అమ్మకూడ అంది అమధ్య. "లేకపోతే నీకు ఈమాత్రంలోనైనా పెళ్లి చేయగలిగే వాళ్లమేనా! అనికూడ అంది.

నిజమే నా పెళ్లికి పెద్దఖర్చంటూ ఏమీ కాలేదు. ఒకరోజు మా పక్కింటి పిన్నిగారు "మా సుబ్రమణ్యం నిన్ను పెళ్లాడ్తాడటే పిల్లా" అని నాతో అన్నారు. ఆయన తరచు మా ఊర్లో ఉండేవాళ్ల బంధువులింటికి వచ్చే వారు. అప్పుడెప్పుడో నన్ను చూశారట. ఇష్ట పడ్డారట. పెళ్లి చేసుకుంటానన్నారట. ఆ మాటే ఆమె నాతో అంది. నాకు అలాంటి ఆశ లేమీ లేవు. నేను వినీ విననట్టు నిర్లిప్తంగా ఊరుకున్నాను. కానీ ఆమాటే నిజమ య్యింది. వాళ్ల అమ్మానాన్నలకు ఇష్టం లేక పోయినా అతని పట్టుదల ముందు అది పెద్ద కారణం కాకపోయింది. వాళ్లకు ఒక్కగానొక్క సంతానం అతనే కావడం చేత అతని ఇష్టాన్ని కాదంటే తమకెక్కడ దూరమౌతాడో నన్న భయంచేత మరేమీ అనలేకపోయారు.

మావాళ్లు కాణీ కట్నం ఇవ్వలేదు. సారెచీ రెలు పెద్దగా ఏమీ జరపలేదు. అయినా అతను అవేమి పట్టించుకోలేదు. అప్పటికి ఏదో నా దశదినాలు ప్రారంభమైనాయని అందరూ అన్నారు. పెళ్లయింది. పదిహేను రోజులయింది.

ఇంతలో ఈ దుర్ఘటన!

జరిగే ఏ సంఘటనలోనూ నా ప్రమేయం ఏమీ లేకపోయినా, అందరూ నాదే బాధ్యత అంటున్నారు. నిందిస్తున్నారు.

అసలు జరిగిందేమిటి? అలా ఎందుకు జరి గింది? అని ఎవరూ ఆలోచించటం లేదు.

నిన్న సాయంత్రం అతను ఆఫీసునుంచి వస్తూనే "రాత్రి బండికి హైదరాబాదు వెళ్లాలి" అన్నారు.

"ఇప్పుడా!" అని ఆశ్చర్యపడుతూ అడి గాను.

హెడ్డాఫీసుపని తప్పదు అన్నారు. "బండికి టైము అవుతోంది కాస్త సూట్‌కేస్ సర్దిపెట్టవూ..." అని అడుగుతూ తను బాత్రూమ్‌లో దూరారు.

తను వెళ్లడం నాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. హైదరాబాదంటే, ఎలా కాదనుకున్నా నాలుగైదురోజులు పడుతుంది. నాకు అసలే ఈ ఊరు కొత్త. ఈ ఇల్లు కొత్త. అతనే లేకపోతే నాకేమీ తోచదు. ఆ విషయమే తనతో చెప్పి వారించబోయాను. లాభం లేకపోయింది.

తను వెళ్లేముందు నన్ను దగ్గరికి తీసుకుంటూ "సుశీ ఎందుకలా ముఖం వేలాడేస్తావు. పని అయినవెంటనే రెక్కలుకట్టుకు వాలనూ..." అంటూ ముద్దుపెట్టుకున్నారు.

"అబ్బాయి రిక్షా వచ్చిందిరా..." మామయ్య బయటినించి కేకవేశారు.

అమ్మా...వెళ్లొస్తాను...అంటూ అత్తగారికి చెప్పి, నా చేతిలో సూట్‌కేసు అందుకొని రిక్షా ఎక్కారు.

తెల్లవారి లేచి మామూలుగా ఎవరి పనుల్లో వాళ్ళమున్నాం. అంతలో పేపరు వచ్చింది. మావయ్య టీ తాగుతూ పేపరు తీశారు. ఒక్కసారిగా, "ఏమేవ్!" అని పెద్ద కేక పెట్టారు. "ట్రైన్ యాక్సిడెంట్ అయిందే!" ఘొల్లుమన్నారు.

మా గుండెల్లో ఉరుము లేని పిడుగు పడింది. మావారు వెళ్ళిన ట్రైన్ విశాఖపట్నం దాటాక పెద్ద లోయలో తిరగబడిందట. బండి చాలా ఎత్తు నుంచి తిరగబడిందని, ప్రయాణికులు ఎవరూ బతికే అవకాశం లేదని పేపరులో వార్త. వార్త వినగానే నాకు తల గిర్రున తిరిగిపోయింది. కళ్ళు చిమ్మచీకట్లు కమ్మినట్లయ్యాయి. ఎవరో వెనకనుండి తోసేసినట్లు ఒక్కసారిగా తూలి పడబోయాను. పక్కనున్న గోడ తగిలి అలా కులబడిపోయాను. మా అత్తగారు నాక్కొంచెం దూరంలో ఆమె కూడా అలాగే నిశ్చేష్టురాలై గోడకు చేరబడిపోయింది. ఒక్క నిముషం తేరుకుని "ఓరి దేముడో! ఎంత అన్యాయం చేశావురో!" అని గోలపెట్టి ఏడ్వసాగింది.

"ఏమయింది, ఏమయిందీ?" అంటూ ఇరుగు పొరుగువాళ్ళు వచ్చారు. కొద్ది క్షణాల్లో ఇంటినిండా జనం మూగారు. ఎలాగో విషయం బయటపడింది. అందరూ దానిగురించే చర్చించటం మొదలుపెట్టారు. ఎవరికి తోచినట్లు వాళ్ళు మాట్లాడసాగారు.

"అయ్యో!" అన్నారు. "రామరామ ..." అన్నారు. "బయలుదేరిన వేళా విశేషం" అన్నారు. చివరికి "ఏ ముదనష్టపు ముండో ఎదురై ఉంటుంది!" అన్నారు.

"అంకెవరూ ... వచ్చిందిగా కోడలు ... అతగాడి కొత్త పెళ్ళాం ..." అంటూ సాగదీశారు.

అదిగో అదే మొదలు. నా మీద దాడి జరగడం. వాళ్ళ నోటికి అడ్డూ, ఆపూ లేదు. వచ్చినవాళ్ళు వస్తున్నారు, పోయినవాళ్ళు పోతున్నారు. కానీ అందరూ అదేమాట —నేను ఆ ఇంట్లో అడుగుపెట్టడమే ఇంత అనర్థానికి కారణమని తేల్చేశారు. ఎప్పుడెప్పుడు ఎవరెవరి ఇళ్ళల్లో కోడలు వచ్చాక ఏమేమి జరిగాయో అంతా ఒప్పజెప్పేస్తున్నారు. అందరూ కలిసి నా మీద పడ్డారు.

వాళ్ళూ ఆడవాళ్ళే కదా! నా బాధను



"రిజల్ట్స్ వచ్చాయి పాసయ్యాను ఆశీర్వదించండి నాన్నా" అన్నాడు చంటి.

"వెధవ ఈసారైనా పాస్ అయినందుకు సంతోషం" అన్నాడు తండ్రి.

"లేదు నాన్నా! వచ్చేసారైనా పాసవ్వాలని దీవించండి!!!"

సి హెచ్. వి. రామకృష్ణారెడ్డి
భూపతిపాలెం

వాళ్ళెందుకు అర్థం చేసుకోరూ! శత్రువుని చూసినట్టు చురచుర చూస్తున్నారు. కొందరైతే నావైపు తిరిగి చేతులు విరుస్తున్నారు. విని .. , విని నాలో అసహనం పెరిగిపోతోంది. నన్ను కనీసంగా తెలియని వాళ్ళు నాతో ఏమాత్రం పరిచయం లేని వాళ్ళు — ఏకంగా నేనే కర్తనని తీర్మానిస్తున్నారు. వాళ్ళు తీరు చూస్తుంటే క్రమేపీ నాలో దుఃఖంతోపాటు ఆవేశం కూడా వస్తోంది. లేచి వీళ్ళందరి నోళ్ళూ మూయించాలనిపిస్తోంది. అంతలోనే మళ్ళీ నిరుత్సాహం. ఒక పక్క నా బతుకు చిరిగిన గాలిపటం అవుతుందేమోనని భయం. ఏ క్షణాన ఏ వార్త వినాల్సి వస్తుందోనని బెంగ. నా నోరు విప్పలేకపోయాను.

ఈ మాటలు పట్టించుకోకూడదని నా దృష్టిని వీధివైపు మరల్చాను. ముందు గదిలో మామయ్య తలవాల్చి దుఃఖపడుతున్నారు. ఆయన చుట్టూ పదిమంది మగ



గీత : మావారు లేకుండా నేను ఒక్క రోజు కూడా ఉండలేను సావిత్రి.

సావిత్రి : మీవారంటే నీకు అంత ఇష్టమా?

గీత : అదేం లేదు —వంట వండడం, బట్టలు ఉతకడం అన్నీ ఆయనే చేస్తారు.

వాళ్ళు ఉన్నారు. వీధిలో నలుగురు మరొక గుంపుగా కూడి మాట్లాడుతున్నారు.

గోడ గడియారం పదకొండు గంటలు కొట్టింది. బర్రుమంటూ ఇంటిముందు ఆటో ఒకటి వచ్చి ఆగింది. అందరూ అప్రయత్నంగా అటు చూశారు.

ఆశ్చర్యం! మా వారు ఆటో దిగుతున్నారు.

"అడుగో ... సుబ్రహ్మణ్యం వచ్చేశాడు" అని పొలోమని అందరూ అటు నడిచారు.

"జానకమ్మా! నీ కొడుకొచ్చాడు , రా... రా...!" అంటూ మా అత్తగారి చుట్టూ ఉన్న అమ్మలక్కలందరూ కూడా గుమ్మంలోకి నడిచారు.

నేను లేవబోయాను. నా మనసు మాత్రం వెనక్కి లాగింది. అలాగే కూర్చుని ఉండిపోయాను.

"ఏం బాబూ? ఎలా ఉన్నావు? అసలేం జరిగింది? ఎలా జరిగింది?" ప్రశ్నల మీద ప్రశ్నలు. అందరూ అతను ఏం చెప్తాడోనని ఆసక్తితో చూస్తున్నారు.

"అసలు జరిగినదేమిటంటే ... ఆయన చెప్తున్నారు. మాటలు వినిపిస్తున్నాయి. మనిషి మాత్రం కనబడటంలేదు.

"నేను విశాఖపట్నం వెళ్ళేసరికి మా హెడ్ ఆఫీసు మేనేజర్ ఆ రోజే అక్కడ బ్రాంచ్‌కి వచ్చారని తెలిసింది. నేను వెళ్తున్నది ఆయన్ని కలవటానికే గనుక నేను అక్కడే దిగిపోయాను" చెప్పారు.

"హమ్మయ్య!" అందరూ గట్టిగా ఊపిరి పీల్చారు.

"ఏదేమైతేనేం పెద్ద గండం గట్టెక్కింది!"

"ఎంతైనా సుబ్రహ్మణ్యం అదృష్టవంతుడు!"

"నేను చెప్పలేదూ ... మనవాడు వెళ్ళిన చోట లాభమే కానీ, నష్టముండదని ..."

"నిజమే. వాడు పుట్టిన వేళా విశేషం అలాంటిది"

అంతవరకూ మా ముందు మాట్లాడిన వాళ్ళే మళ్ళీ తలోమాటా మాట్లాడుతున్నారు. ఆ మాటలు వింటూంటే నాకు ఒళ్ళు మండిపోతోంది. ఏం మాటలు ... ఏ మనుషులు అనిపించింది.

అంతవరకు జరిగిన దుర్ఘటనకు నేనే కారణమన్నవాళ్ళు, అతను తిరిగి వచ్చేసరికి ఒక్కసారిగా మాట మార్చేశారు.

అతను క్షేమంగా రావటానికి కారణం అతని అదృష్టమట! నేను కాదట. అతనికేదైనా జరగరానిది జరిగితే మాత్రం దానికి నేనే కారణమట. అతను కాదట!

పాముకు పది నాలుకలున్నా పరవాలేదేమో, కానీ మనిషికి రెండు నాలుకలుంటే ఎంత ప్రమాదం?!